# నువ్వూ, నేనూ... ఆ వెన్నెల రాత్రి

నువ్వు... నువ్వే! ఎన్నడు అందావని. ఎవరికి అందావని.

అమ్ముకున్నోళ్లన్ని తప్ప నమ్ముకున్నోళ్లన్ని ఎన్నడు కరుణించావని! ఎక్కడ బతికించావని?

అది నైలు కాని అమేజాన్ కాని... గంగ కాని గోదావరి కాని... రూపం ఏదైనా కాని ...బహురూపుల దానివి. ఎన్ని నాటకాలాడావని? ఎన్ని వేషాలేసావని!

కండ్ల ముందే ఏపుగా ఎదిగి పచ్చగా నవ్వి చేతికందేలోపే ఎన్నిసార్లు మాయం కాలేదు.

నట్టింట పుట్లరాశులై మొలిచి కండ్ల ముందే ఎన్నిసార్లు దగా చేయలేదు.

ఎందరు ప్రియులను మార్చలేదు....? ఎందరిని హతమార్చలేదు.

ఎన్ని సంసారాల్లో చిచ్చు పెట్టలేదు.

అప్పుడెప్పుడో....

బాలయ్య!

నీ ప్రియుడు. నిన్ను చూడకుండా ఉండలేనివాడు. ఇల్లూ పిల్లలను విడిచి నీతోనే ఉన్నాడప్పుడు. అప్పుడు నువ్వింకా ముతక మనిషివే! ఈ సింగారాల సోకు లేదు. ఇంత నాజుకు లేదు. ఎర్రగా.... దొడ్డుగా.... అంతే!

• పెద్దింటి అశోక్ కుమార్ •

రోగాలు నొప్పులు లెవ్వు. ఏదీ కావాలని అడిగేదానివి కాదు. కానీ వెట్టిచాకిరీ చేయించుకునేదానివి. ఒక్క బాలయ్య చేస్తే సరిపోయిందా... పాపం భార్యాపిల్లలు కూడా! పిడికెడు తిండికి ఆశపడి, కట్టె పెండ, ఆకు అలం, దుమ్ము ధూళి... నీళ్ళు లేక ఎక్కడ వాడిపోతావోనని పాతాళం నుంచి పైకెత్తిపోశారు. కండ్లల్ల వత్తులేసుకుని కాపలా కాశారు.

కరుణించావా?

నీళ్ళు.... నీళ్ళు! కలిసి కన్నీళ్ళు!!

గూడా, ఏతం, మోట!రాటు!!

రెక్కలు ముక్కలు!

అయినా కడుపునిండ తిండి పెట్టావా...?

చెప్పకు! ఆకలితో చచ్చారు.

షిప్ టు మౌత్.

ఆమెరికా ... అన్నం పెట్టు.

పడవ ఎప్పుడొస్తే అప్పుడు తిండి.

★ ★ ★

తండ్రీ.... పితామహుడా!

నీకా...? నాకా....?

నీకే! నాకైతే కాదు. నిన్నే కదా తిండిపోతును చేసింది. నిన్నే కదా... రూపాన్నే మార్చింది. నీ సంతతినే కదా పెంచింది.

స్వామీ... నాథా.... స్వామినాథ! ఎంత గొప్ప ఆశయం నీది. అందరికీ తిండి పెట్టాలనుకున్నావు. పెట్టావా? మృతకమనిషిని ఎంత వయ్యారిభామను చేశావు. ఎన్ని వగలు నేర్పావు. పగలు రాత్రి ప్రయోగాలు. కొండగట్ల మీద, రాళ్ళ మీద రప్పల మీద వయ్యారి భామతో సయ్యాటలాడించావు.

నిన్నే.... నిన్నే... నిన్నే... అడుగుపెట్టని చోట అడుగు లేయించాడు. అందమైన పేరు పెట్టి అందరి దాన్ని చేశాడు.

నన్ను పట్టించుకున్నాడా...? నా గురించి ఆలోచించాడా?..? నిన్ను గారాల బిడ్డను చేసి నాకు అంటగట్టాడు. అతి నాజూకుగా చేసి నా మెడకు చుట్టాడు. సుకుమారంగా పెంచి నా కొంప ముంచాడు.

అప్పుడూ... ఇప్పుడూ... ఆకలితోనో అప్పులతోనో .... నీ తండ్రి నాకిచ్చిన కట్నం అదేగదా

★ ★ ★

నాగిరెడ్డి! పేరుకు రెడ్డి... నీకు బానిస. ఎంత ఊరించావు. ఎన్ని ఊసులు చెప్పావు? ఎన్నిసార్లు కౌగిలించుకోలేదు. ఎన్ని సార్లు ముద్దుపెట్టుకోలేదు. జంటగా ఎన్ని రాత్రులు మీరు ఏకాంతంగా గడపలేదు. వాన్ని వెర్రి వాన్ని చేసి వెంటతిప్పుకుని చివరికి ఏం చేశావు?

నీ సింగారాల కోసం, వయ్యారాల కోసం వానితో అప్పులు చేయించావు. పిచ్చివాడు. నీకు చిన్న రోగమొస్తే ఎంతో తల్లడిల్లేవాడు. నువ్వు పచ్చగా నవ్వేవరకు కదిలేవాడు కాదు. ఒకనాడు నువ్వు నీళ్ళు లేక పెదవులు తడుపుకుంటుంటే తట్టుకోలేక ఏం చేశాడు... కరంటు సబ్‌స్టేషన్ మీదికే కొట్లాటకు పోయాడు. తన్నులు తిన్నాడు.

నీకు రోగమొచ్చి మంచాన పడితే వాడు నోట్లో మంచి నీళ్ల పొయ్యలేదు. కనిపించిన డాక్టరుకల్లా చూపించాడు. అప్పుచేసి అడ్డమైన మందులు తెచ్చాడు.

నీకు నాజూకు పెరిగింది కదా! ఆశించని రోగం ఏది?

నీ సేవకు కూలీలను పెట్టాడు. నువ్వు వయ్యారంగా నడుము వంచి నాట్యం చేస్తుంటే పరవశించి పోయాడు. కడుపుతో వగలు పడుతుంటే నీ ముందు నుంచి కదలలేకపోయాడు.

నువ్వు పిల్లల్ని కని నెత్తి నెత్తుకు తిరుగుతుంటే ఇంటికి వచ్చి వంశం పేరు ఉద్ధరిస్తావని ఆశపడ్డాడు. కలగన్నాడు.

ఏం చేస్తావు?

తుఫాను రాత్రి మాయమైపోయావు.

★ ★ ★

ఎవడే వాడు?

నువ్వు నా ఇంట్లోకి అడుగు పెట్టగానే నా ఇంటి చుట్టూ తిరగడం మొదలుపెడతాడు.

నాతో చుట్టరికం కలుపుతాడు. నీ వైపు దొంగ చూపులు చూస్తాడు. నీకు తిండిపెట్టి నోడా? సేవ చేసినోడా? నువ్వు ఎండలో చలిలో బురదలో పడుంటే బుజ్జగించి ఇంటికి తెచ్చినోడా! మధ్యలో వాడెవడు?

ఏవో లెక్కలంటున్నాడు. ఏవో అప్పులంటున్నాడు. నువ్వింట్లోకి అడుగుపెట్టి రెండు రోజులైనా కాలేదు. అరే.... ఒక్కరా ఇద్దరా...! ఐదారుగురు. వాళ్ళ చూపులు సరే! నువ్వేంటే వాళ్ళ ముందు వగలు పోతావు.

ఎంతమోసం! ఎన్నడన్నా నా గురించి ఆలోచించావా? నా ఇంటికి చిచ్చు పెట్టి వానికి మిద్దెలు మేడలు కట్టిపెడతావా...? అంతేలే! వాడు ఎర్రగా బుర్రగా ఉన్నాడని మాటలతో అదరగొడతాడని భ్రమించేశావు.

★ ★ ★

రాజాలు!

ఇంత పిల్లగానప్పటినుంచి నీకు తెలుసు.

ఎప్పుడో వయసు మీద నిన్ను చూసి మనసుపడ్డాడు. నీ మీద కలలు కన్నాడు. నువ్వు మహారాణివి కదా... అందవని తెలిసి మనసు చంపుకున్నాడు. నిన్ను విడువలేక బతుకుదెరువు కోసం నీ దాసాన దాసుల్లో దాసుడిగా చేరాడు. నీకు కూలిపని చేశాడు.

వానికి ఎప్పుడైనా కడుపునిండ తిండిపెట్టావా! పిచ్చి వెధవ. అయినా నిన్నే నమ్ముకున్నాడు. కట్టుకున్న పెండ్లాన్ని పుట్టిన పిల్లల్ని నీకు బానిస చేశాడు.

మోసం నీకు వెన్నతో పెట్టిన విద్య కదా! ఎవరిని ఎప్పుడు మారుస్తావో తెలియదు. నీకూ వస్తు వ్యామోహమే కదా! దయా దాక్షిణ్యాలు లేకుండా ఏండ్లకొద్దీ నమ్ముకున్న వాళ్ళను దూరం చేస్తావా? నువ్వు హార్వెస్టర్‌తో అల్లుకుపోతుంటే వాడెంత తల్లడిల్లాడు?

వాన్ని నీ నుంచే కాదు... ఊరినించి తరిమి తరిమి కొట్టావు. గుర్తుందా?

★ ★ ★

రాముడు- భీముడు.

వలపట- దాపట

నోరులేని పశువులు. నువ్వు విసిరేసిన చెత్తను తినే జంతువులు. నీకు పూలపాన్పును వేసి జోలపాడడమే వాటికి తెలుసు.

కరుకు నేలమీద నడిస్తే నీ కాళ్ళు కందిపోతాయని ఎండనకా వాననకా కష్టపడి పూలదారులు చేయడమే వాటికి తెలుసు. వాటి మీద దయ చూపావా? కబేలాలకు అమ్మి రక్తం కండ్ల చూసావు.

చిలకా.... గోరింక. ఊరపిట్ట, వడ్లపిట్ట. గడ్డి చిలుక, బండారిగాడు.

పాపం పక్షులు!

నీ బుగ్గ గిల్లి నిన్ను ముద్దుపెట్టి బతికేవి. నిన్ను తాకి పరవశించిపోయేవి. నీకు కమ్మని కబుర్లు మోసుకొచ్చేవి. ఆటపాటలతో నిన్ను అల్లరి పెట్టేవి. నీ మీద ఏ పురుగు వాలినా ఏరి కాపాడేవి.

కప్ప తల్లులు, ఎండ్రికాయలు!

తెల్లవారి లేచి నీ కాళ్ళు కడిగి కండ్లకద్దుకునేవి. నీ కోట గోడల్లో కాపురముండేవి. నీ ముద్దు మురిపాలను చూసి మురిసిపోయేవి. నీ వైభవాన్ని రాగాలు తీసి పాడేవి. ఎన్నడైనా నీ నుంచి ఏమైనా ఆశించాయా? నిన్ను నొచ్చి నోట మాటన్నాయా?

నక్కలు తోడేళ్ళు! నీ మేనమామలు. నీ అతిథులు.

ఎప్పుడో ఆమాసకో పున్నానికో బుద్ధి పుట్టినప్పుడు నిన్ను గొంతెత్తి పొగుడుతూ వచ్చేవి. చుట్టపు చూపుగా, ఒక రాత్రి ఏదో చిన్న విందు. పాపం తెల్లారేలోగా నీ అంతఃపురాన్ని రాజభవనాన్ని కలయదిరిగిపోయేవి.

ఎంత కుట్ర చేశావు.

ఎంత బీభత్సం చేశావు. ఎవరికి తెలియకుండా సామ్రాజ్యవాదులకు కోవర్ట్‌వి అయ్యావు. అందరినీ నమ్మించావు. విషం కలిపిన పురుగుల్ని కప్పలకిచ్చి, ఆ కప్పలను పిట్టలకిచ్చి , ఆ పిట్టలను నక్కలకు పెట్టి అందరినీ చంపావు.

ఆపరేషన్ గ్రీన్ రెవల్యూషన్... స్పాన్సర్డ్ బై వరల్డ్ బ్యాంక్, వరల్డ్ మార్కెట్. ట్రోగాట్...... ఎంత నిశ్శబ్దంగా పూర్తయింది.

చివరికి... నీడ నిచ్చిన భూమి మీద కుట్ర చేశావు. పెంటమీది తులిసమ్మవు. పేదింటి పిల్లవు. కడుపు తప్ప జేబు చూడని దానివి.

నాగరికత నేర్చి కుట్రలు నేర్చావు. జేబుల్లో ఇమిడి పోవడమే సుఖమనుకున్నావు. సామ్రాజ్యాన్ని విస్తరించుకుని కోటలో పాగా వేశావు. కయ్యల్లో ఉరి కొయ్యలు నాటావు.

★ ★ ★

వాడెవడు?

ప్రతిపక్షనాయకుడా?

ఎవడైతే నాకేం? ఏ పక్షమైతే నాకేం?

నీచ్ కమీన్ కుత్తే!

నీ గురించి ఎంత నీచంగా మాట్లాడాడు. నిన్నేమైనా పట్టించుకున్నాడా? నీ గురించి నాకెన్ని చాడీలు చెప్పాడు. నిన్ను విడిచిపెట్టమని ఎంత నచ్చజెప్పాడు. రంగురంగుల జీవితాన్ని నా ముందుంచాడు. నీకంటె అందగత్తెలను నాకు

అంటగడతానన్నాడు. కాలికి మట్టి అంటని మెట్టపిల్లలు. చెయ్యెత్తు అందగత్తెలు. రంగురంగుల క్యాబరే పిల్లలు.

అయినా నేను నీ అంత పనికి మాలిన మనిషిని కాదుగదా! నిన్నెలా వదులుకుంటాను. ఇప్పుడేంటీ.... నీ మీద తెగ ప్రేమను ఒలకబోస్తున్నాడు. ఎప్పుడు కలుసుకున్నారు. ఎక్కడ మాట్లాడుకున్నారు?

నీకు మద్దతుగా ఒక్కమాట మాట్లాడగానే నెత్తి నెత్తుకుంటావా? వాన్ని చూసి ఇంకొకడు. ఇంకొకనితో ఇంకొకడు. ముక్కూ మొఖం తెలియని వాడు నీకు బాంధవుడా? ఎవడిని ఎప్పుడెత్తుకుంటావో తెలియదు.

అందరినీ చుట్టూ తిప్పుకుంటున్నావు. ఢిల్లీ నుంచి గల్లిదాకా రాజకీయం నడుపుతున్నావు. ప్రియా .... చెలియా... నా ప్రియమైన శత్రువా? నాకనుసన్నలో ఎలా ఉండేదానివి? ఎలా మారిపోయావు. ఎలా ఒదిగిపోయే దానివి... ఎంతగా ఎదిగిపోయావు. ఎదిగిపోయావా? ఎగిరిపోయావా?

★ ★ ★

లైలా... నా మంజులా!

రెండెకరాల భూమిలో నీకు తాజ్‌మహల్ కట్టాను. కుక్క కాపలా కాస్తున్నాను. నువ్వు సరే! కనీసం బట్టలన్నా కట్టుకున్నావు. అదేంటీ.... నీ చెల్లె... ఎర్రగా... నీ కంటె ఎత్తుగా దొడ్డుగా సరిగా బట్టలేకుండా ఛీ... ఛీ... అది నీ వంశ చరిత్రనేమో! నేను పిచ్చివాన్నా... తెలియక కయ్యిలో... ఉరికాయ్యల మీద పడ్డానా...?

నువ్వొక టాలీవుడ్‌లోనే పాపులర్... అది బాలీవుడ్... హాలీవుడ్..!

అబ్బ.... ఎంత రంగు బొమ్మలే! ఇద్దరికీ రెమ్యునరేషన్‌లో ఎంత తేడా!

ఇప్పుడు మీరు రోగులు... ఒళ్ళంతా విషమే! అడ్డమైన పెస్టిసైడులు తింటే అంతేగదా! చీకటి రాజులతో ఎందుకంత దోస్తి? ఇన్నేండ్ల కాపురంలో ఎన్నడన్నా నా ఇంట్లో నాలుగు రోజులకు మించి ఉన్నావా?

నన్ను నమ్మించి గడప దాటుతావు. మళ్ళీ ఎప్పుడో? నీ చూపు ఎప్పుడూ చీకటి కొటారాల వైపే! అందనంత దూరంలో!

ఒక్కనాడు .... ఒక్కనాడు నన్ను మళ్ళీ పలకరించావా... పరామర్శించావా! నా తిండి తింటూ మంది పాట పాడావు.

నీకు తెలుసు. నన్ను ఎక్కడ ఉంచాలో ఎంతలో ఉంచాలో. నాకే తెలియదు. అందుకే కదా సర్వస్వం నువ్వే అనుకున్నది. మోసం చేసిపోతే విరహంలో బక్కరాజం ఉరేసుకుంటే గోపాలు దేశం పోయిండు. అయినా వాళ్ళ సంసారాలన్నా నిలబెట్టావా? తల్లీ పిల్లను బిచ్చగాళ్ళను చేశావు!

వెంకట లచ్చిమి ఏం పాపం చేసిందే!

నమ్మి మొగన్ని నీ వెంట పంపింది. మాయం చేశావు. కొడుకును నీ చేతుల్లో పెట్టింది. నమిలి మింగావు. మనవడిని పంపడానికి మనసొప్పలేదేమో... ఎర్రటి ఎండల ఎడారి దేశం పంపింది కానీ పక్క నున్న నీ నీడను కూడా పారనియ్యిలేదు. మనసు ఇరిగితే అతకదు తెలుసా?

★ ★ ★

ప్రియా ... నా సఖియా!

ఎంత కాదనుకున్నా నువ్వే గుర్తొస్తున్నావు. నన్ను విడిచి నువ్వుండగలిగినా నిన్ను విడిచి నేనుండలేను. నీ అడుగులకు మడుగులత్తాలని ఉంది. నీతో కలిసి నడవాలని ఉంది. నీ మేలి రంగు బంగారు ఛాయను పొద్దు పొడుపు ఎండలో చూడాలని ఉంది. నీ మెడకు పొత్తి చుట్టి నెత్తిన కట్ట ఎత్తి ముద్దు పెట్టాలని వుంది. పున్నమి రాత్రులు నీ ఒడిలో వెచ్చగా గడపాలని వుంది.

నా ఎడ్ల బండిలో... నీతో ఊరేగాలని వుంది.

నువ్వూ, నేనూ... వెన్నెల రాత్రి. అంతే చాలు. నీ మాయలు మరిచిపో... నా గాయాలు మరిచిపోతాను. ఎప్పటిలా ఇద్దరం పంటకాలువల ఒడ్డున, గట్టుమీద... కబుర్లాడుకుందాం. నిన్నడిగింది పిడికెడు తిండే కదా.... కరుణిస్తే నీ సేవ చేసుకుంటాను. ఏడాది పొడుగునా నిన్ను ఇంట్లో దాచుకుంటాను. నిజంగా ఆ రోజు వస్తుందా...? అన్ని మెట్ల పైనుంచి ... అంత ఎత్తు నుంచి... గంగిరెద్దులోడికి బిచ్చం కోసం... కాటిపావల పాటకోసం... ఈ బక్కోడి కోసం...

నిజంగా నువ్వు అందివస్తావా...?

● ఆదివారం, ఆంధ్రజ్యోతి – 16 డిసెంబర్, 2007 ●